సాక్షి నల్లగొండ
ఆదివారం । 12 । నవంబర్ । 2023



ఓట్ల 'పండుగ'
జిల్లాలో ఎన్నికల నందడి మొదలైంది. దీపావళి వేళ పల్లెలు, పట్టణాలు పార్టీల ప్రచారంతో హోరెత్తుతున్నాయి. - 2లో



'జీ, ఆర్' అక్షరాల వారికే..
దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా జీ, ఆర్ అక్షరాలతో పేర్లు మొదలయ్యే వారే విజయం సాధిస్తున్నారు. - 2లో



సామాన్యులకు కష్టమే
ఎన్నికల్లో సామాన్యులు పోటీ చేయడం కష్టమేనని రూపాయి ఉద్యమకారుడు రామచంద్రారెడ్డి అన్నారు. - 2లో

న్యూస్‌రీల్

మంత్రి దీపావళి శుభాకాంక్షలు



నల్లగొండ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. అజ్ఞానాంధకారాన్ని పారదోలి జ్ఞానకాంతులు ప్రసరింపజేయాలనే తత్వాన్ని దీపావళి నేర్పుతుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, సిరిసంపదలతో తులతూగాలని మనసారా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి : ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ, నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపేది కావాలని ఆకాంక్షించారు.

సీఎం సభాస్థలి పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా: హాలియాలోని దేవరకొండ రోడ్డు అనుముల వద్ద ఈనెల 14న జరగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను బీఆర్‌ఎస్ పార్టీ సాగర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్ శనివారం పరిశీలించారు. సభాస్థలి, పార్కింగ్, హెలిప్యాడ్ తదితర పనులను పరిశీలించి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, తదితరులు ఉన్నారు.

ప్రలోభాలకు లొంగొద్దు


నకిరేకల్: ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రలభాలకు లొంగకుండా నిస్వార్థపరులను ఎమ్మెల్యేలుగా ఎన్నుకునేందుకు అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో శనివారం ఆ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. పోలింగ్ శాతం పెరిగేలా ఓటర్లను చైతన్యపరిచేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గోపికృష్ణ, ఆర్‌ఐ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం

రామగిరి(నల్లగొండ): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి(డీఎస్‌ఓ) వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తిప్పర్తి మండలం తానేదార్‌పల్లి, కేశరాజుపల్లి గ్రామాలొంల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కాగానే ఆన్‌లైన్ డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతులకు త్వరగా డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర రావు, ఆర్‌ఐ లింగస్వామి, ఏపీఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బరిలో హేమాహేమీలు

పోటీలో సీనియర్ నేతలు, మంత్రి, మాజీ మంత్రులు
- హోరాహోరీగా సాగనున్న ఎన్నికల పోరు
- 12 స్థానాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు
- కోదాడ మినహా 11 స్థానాల్లో బీజేపీ పోటీ
- ఏడు స్థానాల్లో సీపీఎం పోటీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎన్నికల బరిలో హేమాహేమీలు తలపడబోతున్నారు. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో ప్రచారం హోరాహోరీగా సాగనుంది. 14వ తేదీ నుంచి ప్రచారం ఊపందుకోనుంది. బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున సీఎం పర్యటనలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఇక కాంగ్రెస్, బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకుల ప్రచార కార్యక్రమాలను దీపావళి తరువాత పెద్ద ఎత్తున నిర్వహించేలా ఆయా పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. వాటితోపాటు ఇతర పార్టీల ప్రచారంతో వచ్చే 15 రోజులు జిల్లా హోరెత్తనుంది. అన్ని పార్టీల్లోని సీనియర్ నేతలు, మంత్రి, మాజీ మంత్రులు ఈ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి అన్ని నియోజకవర్గాల్లో పోటీచేస్తున్న వారంతా ఒకటి కంటే ఎక్కువసార్లు బరిలో నిలిచిన వారే. ఇక కాంగ్రెస్‌లో నలుగురు మినహా మిగితా వారు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వారే తలపడుతుండటం గమనార్హం.

ఎక్కువ నియోజకవర్గాల్లో గట్టి పోటీనే..
మెజారిటీ నియోజకవర్గాల్లో ఈసారి గట్టి పోటీనే ఉండనుంది. ఇప్పటికే జిల్లాలోని ఏ నియోజకవర్గంలో ఎవరెవరు పోటీలో ఉంటారనేది దాదాపుగా తేలిపోయింది. ఎక్కువ స్థానాల్లో ద్విముఖ పోటీ, కొన్ని చోట్ల త్రిముఖ పోటీ ఉండనుంది. కొందరికి పార్టీ బలమైతే, మరికొందరికి పార్టీతోపాటు వ్యక్తిగత బలం గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా సూర్యాపేటలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. హుజూర్‌నగర్‌లో మాజీ మంత్రి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే సైదిరెడ్డి పోటీలో నిలిచారు. నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. నాగార్జునసాగర్‌లో ఈసారి మాజీ మంత్రి జానారెడ్డితో పాటు ఆయన తనయుడు జయవీర్ నామినేషన్ వేశారు. జయవీర్ మాత్రమే పోటీలో ఉండే అవకాశం ఉంది. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌తో పాటు భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వరుసగా బీఆర్‌ఎస్ నుంచే రెండుసార్లు విజయం సాధించిన వారు కాగా.. నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్ రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచినవారే పోటీ పడబోతున్నారు. ఇందులో కొందరు కొత్త అభ్యర్థులతోనూ పోటీ పడనున్నారు.

రానున్న అగ్రనాయకులు
గత రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ పార్టీనే అధికారంలో ఉండటంతో కొన్ని వర్గాల్లో కొంత వ్యతిరేక భావన వచ్చినట్లు, మరికొన్ని వర్గాల్లో కాంగ్రెస్ పట్ల సానుకూలత ఏర్పడినట్లు సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జరిగే ఈ ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్లుగా రెండు పార్టీల అభ్యర్థులు తలపడబోతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు రెండు నెలల కిందటే ప్రచారం మొదలుపెట్టగా, సీఎం కేసీఆర్ రెండు విడతలుగా ప్రజా ఆశీర్వాద సభలకు హాజరయ్యారు. 14న మళ్లీ రాబోతున్నారు. దీపావళి తర్వాత కాంగ్రెస్‌పార్టీ కూడా పెద్ద ఎత్తున బహిరంగ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు కర్ణాటక ముఖ్య నేతలు ప్రచార సభలకు హాజరు కానున్నారు. బీజేపీ కూడా కేంద్ర మంత్రులు, జాతీయ పార్టీ నేతలను రంగంలోకి దింపేందుకు రంగం సిద్ధం చేసింది.

11 స్థానాల్లో బీజేపీ, 7 స్థానాల్లో సీపీఎం
ఈ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు తలపడబోతున్నారు. ఒక్క కోదాడ మినహా మిగిలిన 11 స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుండగా, కోదాడలో బీజేపీతో పొత్తులో భాగంగా జనసేన పోటీ చేస్తోంది. సీపీఎం.. కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడంతో ఈసారి 7 స్థానాల్లో పోటీలో ఉండేందుకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. నల్లగొండ, మునుగోడు, మిర్యాలగూడ, నకిరేకల్, హుజూర్‌నగర్, కోదాడ, భువనగిరి స్థానాల్లో సీపీఎం పోటీ చేస్తోంది. వాటితోపాటు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, బీఎస్పీ తదితర పార్టీల నుంచి అభ్యర్థులు పోటీలో ఉండనున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్

- ఎన్నికల సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకులు

నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేలా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, అవినాష్ చంపావత్, ఆర్.కన్నన్, వ్యయ పరిశీలకులు సతీష్ గురుమూర్తి, డీఎం.నిమ్జే, సంతోష్ కుమార్, పోలీస్ పరిశీలకులు విజయ్‌సింగ్ మీనా, వినీత్ ఖన్నా సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం కరపత్రాలు ముద్రణ చేసేప్పుడు పబ్లిషర్, ప్రింటర్ నిబంధనలు పాటించాలని, మెటీరియల్ పంపిణీ, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ఉపయోగించే విధానంపై పోలింగ్ సిబ్బందికి శిక్షణా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచార నిమిత్తం వాహనాలు, ర్యాలీలు, సమావేశాలు, మైకులకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం లేకుండా పోలీసులు మానిటర్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు. ఎన్నికలకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ అపూర్వ రావు మాట్లాడుతూ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్వో ఆఫీసుల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

సమావేశం అనంతరం కేంద్ర ఎన్నికల పరిశీలకులు కలెక్టర్‌తో కలిసి తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్‌రూంలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్‌ను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పరిశీలకులతోపాటు కలెక్టర్, ఎస్పీ, పీఆర్ ఎస్‌ఈ తిరుపతయ్య, ట్రాన్స్‌కో ఎస్‌ఈ చంద్రమోహన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, డీపీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో కలెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల పరిశీలకులు

నటుడు చంద్రమోహన్‌కు సాగర్‌తో అనుబంధం



నాగార్జునసాగర్ : సినీ నటుడు చంద్రమోహన్‌కు నాగార్జునసాగర్‌తో అనుబంధం ఉంది. సాయి సూరజ్ ఫిలింస్ పతాకంపై ఎస్‌కె.సైదా స్వీయ దర్శకత్వంలో 'పాషా అందరివాడు' అనే చిత్రం రూపొందింది. ఈ చిత్రంలో ప్రముఖ నటుడైన చంద్రమోహన్, ప్రభాకర్, చిన్న, హరి, అనంత్‌రాంజగన్ నటించారు. నాగార్జునసాగర్ పరిసరాల్లో ఈ సినిమా చిత్రీకరణ సాగింది. ఈ చిత్రంలోని పలు సన్నివేశాలు సాగర్‌మాత ఆలయం, చర్చి, మసీదు తదితర ప్రాంతాల్లో తీశారు. 2014లో విడుదలైన ఈ చిత్రం సందేశాత్మకమైన సినిమాగా పేరు తెచ్చుకుంది.

జిల్లా ఓటర్లు 14,64,080

తుది జాబితా విడుదల
- ఈ ఎన్నికలకు మొత్తం ఓటర్లు వీరే..
- మునుగోడులో అత్యధికం.. మిర్యాలగూడలో అత్యల్పం
- కొత్త ఓటర్లు 37,600 మంది

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
దేవరకొండ	1,27,181	1,24,425	16	2,51,622
నాగార్జునసాగర్	1,14,752	1,18,640	20	2,33,412
మిర్యాలగూడ	1,13,911	1,17,455	25	2,31,391
నల్లగొండ	1,19,434	1,24,972	54	2,44,460
మునుగోడు	1,26,223	1,26,421	4	2,52,648
నకిరేకల్	1,24,668	1,25,876	3	2,50,547
	7,26,169	7,37,789	122	14,64,080

(సర్వీస్ ఓటర్లు : పురుషులు 521, మహిళలు 22 మొత్తం 543 మంది)



నల్లగొండ: జిల్లాలో ఓటర్ల సంఖ్య తేలింది. జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో 14,64,080 మంది ఓటర్లు ఉన్నట్టు తుది జాబితాను ఎన్నికల సంఘం శనివారం విడుదల చేసింది. ఇందులో పురుషులు 7,26,169 మంది, మహిళలు 7,37,789, ఇతరులు 122 మంది ఉన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియకు పది రోజుల ముందు వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అయితే దీంతో జిల్లాలో కొత్తగా ఓటర్లు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే నాటికి జిల్లాలో 14,26,480 మంది ఓటర్లు ఉండగా తర్వాత కూడా ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. దీంతో యువత పెద్ద ఎత్తున ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో మొత్తం ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈ నెలాఖరులో జరగనున్న ఎన్నికల్లో వీరంతా ఓటెయ్యనున్నారు.

కొత్తగా 44వేలకుపైగా ఓటు నమోదు
ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్తగా ఓటు నమోదు అవకాశం ఇవ్వడంతో 44,029 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 37,600 మందిని ఓకే చేశారు. మిగతా దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. అయితే గత అక్టోబర్ 4వ తేదీ వరకు జిల్లాలో 14,26,480 మంది ఓటర్లున్నారు. అందులో పురుషులు 7,08,924 మంది ఉండగ మహిళలు 7,17,436 మంది ఉండగా, 120 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ప్రస్తుతం ఓటు నమోదు ప్రక్రియ ముగియడంతో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రకటించింది.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

నల్లగొండ టౌన్: ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పెన్షనర్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈహెచ్‌ఎస్ బిల్లులను కూడా విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈ నెలలో జన్మించిన 30 మంది పెన్షనర్లను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జిల్లా పుల్లయ్య, జి.సుధాకర్, ఎం.శేషారెడ్డి టి.రమేష్, కె.పాండురంగం, రఘునాథం, ఆజాంఅలీ, రంగయ్య, రామలింగం, మోహన్ రావు, మహేశ్వర్, అఫ్జల్, వెంకటయ్య, బాలరాజు, భిక్షం, వెంకట్‌రెడ్డి, గోనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్లను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

34వేల మందికి వైద్యపరీక్షలు

- 34 వారాల్లో ఆరోగ్య మహిళ ద్వారా అందించిన సేవలు
- 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొనసాగుతున్న కార్యక్రమం
- అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ
- వైద్యం కోసం మహిళల బారులు



నల్లగొండలోని మాన్యంచెల్కలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నల్లగొండ టౌన్: మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది మార్చి 8న ప్రారంభించిన ఆరోగ్య మహిళా కార్యక్రమం అతివలకు భరోసాగా నిలుస్తోంది. మహిళలకు వచ్చే జబ్బులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. దీంట్లో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం ఎంపిక చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 34 వారాలుగా ఇప్పటి వరకు మొత్తం 34,056 మంది మహిళలకు ప్రత్యేక వైద్యసేవలు అందించారు.

మొదట ఆరు కేంద్రాల్లో..
జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో తొలుత ఆరు నియోజకవర్గాల్లోని ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్క, డిండి, నిడమనూరు, వేములపల్లి, కట్టంగూర్, మర్రిగూడలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రెండో దశలో తిప్పర్తి, చండూరు, చింతపల్లి, శాలిగౌరారం, దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్యమహిళను ప్రారంభించారు. అయితే జిల్లాలోని తొలి, రెండో విడతల్లో ఎంపిక చేసిన మొత్తం 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం మహిళా వైద్యుల చేత మహిళలకు ప్రత్యేక వైద్యసేవలను అందిస్తున్నారు.

అందిస్తున్న సేవలు
మహిళలకు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, రక్తహీనత, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్స్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, కుటుంబ నియంత్రణ, మోనోపాజ్ నిర్వహణ, రుతుస్రావం, ఊబకాయం, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి వైద్యంతోపాటు అవసరమైన వారికి ఉచితంగానే మందులను అందిస్తున్నారు. పీహెచ్‌సీ స్థాయిలో చేసే వైద్యసేవలు ఉంటే అక్కడే చికిత్సలను కొనసాగిస్తున్నారు. ఏమైన తీవ్రమైన సమస్యలుంటే వెంటనే వారిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేసి అక్కడి తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఉచితంగా ఖరీదైన పరీక్షలను చేయిస్తున్నారు. అక్కడ ఉన్న ప్రత్యేక వైద్యుల చేత వైద్యం అందిస్తున్నారు.

పరీక్షల వివరాలు ఇలా..	
ఎంపికైన పీహెచ్‌సీలు	11
పరీక్షలు చేసిన వారాలు	34
పరీక్షలు చేయించుకున్న మహిళలు	34,056
రొమ్ము క్యాన్సర్ పరీక్షలు	29,217
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టెస్టులు	29,162
క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించిన బాధితులు	07

మహిళలకు వరంలాంటిది



ఆరోగ్య మహిళ కార్యక్రమం మహిళలకు వరంలాంటిది. ప్రతి మంగళవారం ఎంపిక చేసిన 11 పీహెచ్‌సీల్లో మహిళా వైద్యులచేత ప్రత్యేక వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నాం. ఏమైన వ్యాధులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ప్రత్యేక వైద్యుల చేత చికిత్స అందిస్తున్నాం. మహిళలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ, నల్లగొండ

తగ్గుతున్న మహిళల మరణాలు
మహిళలకు వచ్చే క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, రక్తహీనత, లైంగిక తదితర వ్యాధులను గతంలో ముందుగా గుర్తించకపోవడంతో ఆ వ్యాధులు ముదిరి అనేక మంది మహిళలు మృత్యువాత పడేవారు. కానీ ప్రస్తుతం ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి వారికి ఉచితంగా పరీక్షలు చేసి చికిత్స అందించడం ద్వారా మహిళల మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉచితంగా ఖరీదైన వైద్యం చేస్తుండడంతో ప్రతి మంగళవారం ఎంపిక చేసిన పీహెచ్‌సీల్లో కొనసాగుతున్న ఆరోగ్య మహిళ శిబిరాలకు మహిళలు బారులుదీరుతున్నారు.

బీఎల్‌ఆర్ గెలుపునకు కృషిచేయాలి

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



చేయిచేయి కలిపి అభివాదం చేస్తున్న జానారెడ్డి, శంకర్‌నాయక్, బీఎల్‌ఆర్ తదితరులు

మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్‌ఆర్) గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషిచేయాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అధ్యక్షతన శనివారం మిర్యాలగూడ పట్టణంలోని జేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులంతా వ్యక్తిగత ప్రాధాన్యతలు పక్కనపెట్టి పార్టీ అధిష్టానం నిర్ణయానికి కంకణబద్ధులై బీఎల్‌ఆర్‌ను గెలిపించుకుందామన్నారు. అనంతరం శంకర్‌నాయక్ మాట్లాడుతూ బీఎల్‌ఆర్ విజయమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. బీఎల్‌ఆర్ మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ అందరివాడినేనని, ప్రతి కార్యకర్తలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని, ఈ ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అయితే నిన్నటి వరకు వేరు కుంపటిగా ఉన్న నాయలకులంతా ఒకే వేదికపై చేయిచేయి కలిపి ఐక్యతారాగం చాటడంతో కార్యకర్తలు, నాయకుల హర్షధ్వానాలతో ఫంక్షన్ హాల్ మారుమోగింది. ఈ సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, నాయకులు తలకొప్పుల సైదులు, పగిడి రామలింగ్యయాదవ్, చిరుమర్రి కృష్ణయ్య, పొదిల శ్రీనివాస్, కాకునూరి బసవయ్యగౌడ్, బొంగరాల కిరణ్, మెరుగు శ్రీనివాస్, ఎం.ఏ.సలీం, మాలి కాంతారెడ్డి, గాజుల శ్రీనివాస్, కందుల నరసింహారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నా దీవెన నీకు.. మీ అమ్మానాన్న ఓటు నాకు



ప్రచారంలో భాగంగా పెన్‌పహాడ్ మండలం అనంతారంలో పువ్వులతో చిన్నారిని ఆశీర్వదిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

● అమ్మలూ.. మా అమ్మను గుర్తుంచుకోండి





ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతకు ఓట్లు వేయాలని యాదగిరిగుట్ట, గుండాల మండలం అనంతారంలో ప్రచారం చేస్తున్న ఆమె కుమార్తెలు అంజనీ, హర్షిత

● అభయ 'హస్తం'



భువనగిరి మండలం రాయగిరిలో మూకుమ్మడిగా చేతులెత్తి కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న మహిళలు, నాయకులు

● మావారి గుర్తు.. కారు



వలిగొండ మండలంలో అరూరులో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి శేఖర్‌రెడ్డి సతీమణి వనిత

జంగ్ తెలంగాణ

ఓట్ల 'పండుగ'



- కూలీలకు చేతినిండా 'ప్రచార' పని
- ఆటోవాలాలకు పెరిగిన గిరాకీ
- కిక్కిరుస్తున్న బార్లు, హోటళ్లు
- సందడిగా పల్లెలు.. పట్టణాలు

సూర్యాపేట, భువనగిరి టౌన్ : జిల్లాలో శాసనసభ ఎన్నికల సందడి మొదలైంది. మరో 18 రోజుల్లోనే పోలింగ్ ఉండడంతో అభ్యర్థులు కదనరంగంలోకి దిగారు. ఈ నెల 10వ తేదీన శుక్రవారంతో నామినేషన్ల స్వీకరణ ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గ్రామాల బాటపట్టారు. దీపావళి వేళ పల్లెలు, పట్టణాలు పార్టీల ప్రచారంతో హోరెత్తుతున్నాయి. ఫ్లెక్సీలు, హోటళ్లు, మైక్‌సెట్ దుకాణాలకు గిరాకీ పెరిగింది. పెయింటర్లు, కూలీలకు ప్రచార పని దొరుకుతోంది.

అన్ని పార్టీల ప్రచారాలకు వారే..

గతంలో ఒక పార్టీకి చెందిన వ్యక్తి మరో పార్టీ కార్యక్రమాలకు వెళ్లేవారు కాదు. కానీ ఇప్పుడు మాత్రం అన్ని పార్టీల కార్యక్రమాలకు జనం తరలి వెళ్తున్నారు. దీంతో ఏ పార్టీ ప్రచారం, ర్యాలీ చూసినా జనంతో కిక్కిరిసిపోతున్నాయి. మరోవైపు పత్తితీత, మిరప చేలలో పనులకు ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి ఆటోలు, టాటాఏసీ వాహనాల్లో కూలీలను తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం మిరప చేలలో మొదలు కాకపోగా.. పత్తితీత పనులు నెమ్మదించాయి. దీంతో ప్రచారానికి జనాన్ని సులువుగా తీసుకొచ్చేందుకు గాను ఆయా వాహనాల డ్రైవర్లనే నాయకులు సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. కూలీలను తీసుకొచ్చే వాహనాలకు రూ.800 నుంచి రూ.1000 చొప్పున చెల్లించి.. ఒకొక్కరికి రూ.200, రూ.300 వరకు ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో బారులు

ఎన్నికల వేళ అభ్యర్థులు తమ మద్దతుదారులతో సమావేశాలు నిర్వహిస్తుండడంతో వారికి భోజనం, మద్యం అందిస్తున్నారు. అభ్యర్థులు మద్దతుదారులతో ఇప్పటికే పట్టణాల్లోని హోటళ్లు, రెస్టారెంట్‌లు బిజీ అయ్యాయి. కొందరైతే ముందుగానే టోకెన్లు తీసుకుని హోటళ్లు, రెస్టారెంట్లకు కార్యకర్తలను పంపుతున్నారు. మరోవైపు మద్యం దుకాణాల వద్ద కూడా సందడి కనిపిస్తోంది. నేతలు వైన్స్‌ల వద్ద ముందుగానే స్లిప్‌లు ఇచ్చేసి తర్వాత డబ్బులు కట్టేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది.

మైక్ సెట్లు.. లౌడ్ స్పీకర్లు..

ఓ వైపు పెళ్లిళ్లు, మరోవైపు ఎన్నికల సీజన్ కావడంతో మైక్‌సెట్లకు డిమాండ్ పెరిగింది. అభ్యర్థులు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఫ్లెక్సీలు, తమకు కేటాయించే గుర్తులు స్టిక్కర్లు ముద్రించే షాపులు సైతం బిజీగా మారాయి.



కోలాట బృందాలతో స్వాగతం..

ప్రస్తుత ఎన్నికల్లో కోలాట బృందాలకు మంచి ఆదరణ ఉంది. అభ్యర్థులు తమ గ్రామాల్లోకి ప్రచారానికి వచ్చిన సమయంలో స్వాగతం పలికేందుకు అన్నిపార్టీల స్థానిక నేతలు వీరిని సంప్రదిస్తున్నారు.

ప్రచార రథాలకు ఫుల్ డిమాండ్



అభ్యర్థి తాను, తన పార్టీ గుర్తు ప్రజలకు చేరువయ్యేందుకు గాను ఆటోలకు మైక్‌లు పెట్టి వాడవాడలా ప్రచారం చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆటోలు, బొలెరో వాహనాలకు మంచి గిరాకీ ఏర్పడింది. ఆటోలను రోజువారీగా.. నెలవారీగా మాట్లాడుకుంటున్నారు. ఇటీవల జరిగిన నామినేషన్ల దాఖలు కార్యక్రమాలకు ఆటోల్లో భారీగా కార్యకర్తలను సమీకరించారు. ఓ ప్రధాన పార్టీ ఏకంగా ఆటో డ్రైవర్లనే రూ.200 కూలికి జనాన్ని తీసుకురావాలంటూ ఆఫర్ ఇచ్చింది.

దీపావళి టపాసులపై కోడ్ ఎఫెక్ట్

చిలుకూరు : దీపావళి అంటేనే.. టపాసుల మోత. వారం రోజుల ముందు నుంచే టపాసులు కాల్చుతూ చిన్నారులు, యువకులు సందడి చేస్తుండేవారు. ఇప్పుడు ఆ హడావుడి కనిపించడం లేదు. ఎన్నికల నేపథ్యంలో టపాసులు కాల్చడంపై పోలీసులు ఆంక్షలు పెట్టడంతో టపాసుల దుకాణాలు బోసిబోయి కనిపిస్తున్నాయి. టపాసులపై 28 శాతం జీఎస్టీ విధించడంతో ధరలు కూడా భారీగా పెరిగాయి. ఈ కారణంగా కూడా టపాసుల వ్యాపారం తగ్గింది.



బి, ఆర్ అక్షరాల వారిదే విజయం

● 1978 నుంచి దేవరకొండలో పునరావృతమవుతున్న సెంటిమెంట్

దేవరకొండ : రాష్ట్రంలోనే దేవరకొండ నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార చిహ్నమైన పూర్ణకుంభాన్ని అందించిన ఘనత ఇక్కడి దేవరకొండ ఖిలా దుర్గానికి ఉంది. 1957లో దేవరకొండ నియోజకవర్గంగా ఏర్పాటు కాగా.. 1978లో దేవరకొండను ఎస్టీలకు కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బి, ఆర్ అక్షరాలతో పేర్లు ప్రారంభమయ్యే నాయకులే ఇక్కడ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. 1978, 1983 వరకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ధరావత్ రవీంద్రనాయక్ గెలుపొందగా, 1985, 1989, 1994లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి బద్దుచౌహాన్ గెలుపొందారు. 1999లో కాంగ్రెస్ నుంచి రాగ్యానాయక్ గెలుపొందారు. రాగ్యానాయక్ అకాల మరణంతో 2002 ఉప ఎన్నికల్లో ఆయన సతీమణి భారతీరాగ్యానాయక్ ఎన్నికయ్యారు. 2004, 2014లో సీపీఐ నుంచి 2018లో టీఆర్‌ఎస్ నుంచి రమావత్ రవీంద్రకుమార్ విజయం సాధించగా.. 2009లో కాంగ్రెస్ నుంచి బాలునాయక్ గెలుపొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి రామశర్మ విజయం సాధించారు. ప్రస్తుతం జరుగనున్న ఎన్నికల్లో దేవరకొండ నుంచి ఎవరు గెలుస్తారే విషయం చర్చనీయాంశమైంది.

మిర్యాలగూడ బరిలో ఇద్దరు లక్ష్మారెడ్డిలు..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అసెంబ్లీ బరిలో ఇద్దరు లక్ష్మారెడ్డిలు నిలిచారు. ఒకరు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తుండగా.. మరొకరు స్వాతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. వారిలో ఒకరు మిర్యాలగూడ పట్టణానికి చెందిన బత్తుల లక్ష్మారెడ్డి కాగా.. మరొకరు నిడమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన బారెడ్డి లక్ష్మారెడ్డి. వీరు బి అక్షరంతో వచ్చే ఇంటి పేరు గల వారు కూడా కావడంతో స్థానికుల్లో చర్చ సాగుతోంది. అయితే బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్న నల్లమోతు భాస్కర్‌రావు సొంతూరు కూడా నిడమనూరు మండలం శాఖాపురం కావడం విశేషం.

ఎన్నికల్లో పోటీ సామాన్యులకు కష్టమే



రేణికుంటలో ఒక్క రూపాయి అడిగి తీసుకుంటున్న గుజ్జుల రామచంద్రారెడ్డి

రాజాపేట: నేటి సమాజంలో ఎన్నికల్లో సామాన్యులు పోటీ చేయడం కష్టమేనని ఒక్క రూపాయి ఉద్యమకారుడు గుజ్జుల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రాజాపేట మండలంలోని రేణికుంట గ్రామంలో 'ఒక్క సమస్య చెప్పండి.. ఒక్క రూపాయి ఇవ్వండి.. ఒక్క ఓటు వేయండి' అంటూ ఓటర్ల నుంచి ఒక్క రూపాయి అడిగి తీసుకుంటూ ఓటు హక్కు గురించి ఆయన వివరించారు. కొందరు రాజకీయాలను వ్యాపారంగా మార్చారని విమర్శించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన వ్యక్తులు ప్రజాల సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్లు తాత్కాలిక ప్రయోజనాలకు తమ ఓటును అమ్ముకుంటే దీర్ఘకాలిక ప్రయోజనాలను కోల్పోతారని అన్నారు. ఓటు గురించి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 2009, 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేశానని, ఇప్పుడు నాల్గోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, తనని గెలిపించాలని కోరారు.

ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు

● సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : ఎన్నికలకు సూర్యాపేట జిల్లాలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఎన్నికల్లో పోలీస్ బందోబస్తు నిర్వహణ, యాక్షన్ ప్లాన్‌పై శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఓటర్లకు రక్షణ కల్పించడం, ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా అమలు చేయడం పోలీసు ముఖ్య విధి అని అన్నారు. సిబ్బంది ఎన్నికల డ్యూటీపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒత్తిడి లేకుండా పని చేయాలని, ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యమైన ప్రతి అధికారితో సమన్వయంగా పని చేయాలని సూచించారు. పారామిలిటరీ సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియమించాలన్నారు. ఎన్నికల అధికారి అనుమతి లేనివారిని, గుర్తింపు లేని వారిని పోలింగ్ బూత్‌లోకి అనుమతించవద్దని సూచించారు. ఎన్నికల ముందు రోజు నుంచి స్థానికేతరులు గ్రామాల్లో సంచరించకుండా ముందస్తు నిఘా ఉంచాలని, పోలింగ్ బూత్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చెక్ చేసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూంల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించడం, వాటికి రక్షణ కల్పించడం, పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ కేంద్రాలకు తరలించడంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలన్నారు. వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా పని చేయాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన పౌరులపై కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు, ఓటర్లు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, రవి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సీఐలు, ఐటీ కోర్, కమ్యూనికేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



అరోరా ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలిస్తున్న అబ్జర్వర్లు, కలెక్టర్, డీసీపీ, అధికారులు

సాక్షి,యాదాద్రి : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల పోలీసు పరిశీలకుడు విపుల్‌కుమార్ హెచ్చరించారు. సాధారణ, వ్యయ పరిశీలకులతో కలిసి శనివారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్, నోడల్ అధికారులతో సమావేశమై ఎన్నికల ఏర్పాట్లు, క్షేత్రస్థాయిలో బృందాల పనితీరును సమీక్షించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి అతిక్రమించకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. పారదర్శకతతో కూడిన ఎన్నికల నిర్వహణకోసం పాటుపడాలన్నారు. అనంతరం ఎన్నికల ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, చెక్ పోస్టుల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారి, డీసీపీ ఆయనకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అదేవిధంగా భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలను ఎన్నికల పరిశీలకులు సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

ఆలేరులో..

ఆలేరు: పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు. ఏర్పాట్ల గురించి రిటర్నింగ్ అధికారి వీరారెడ్డి వారికి వివరించారు. వారి వెంట కలెక్టర్, డీసీపీ, యాదగిరిగుట్ట ఏసీపీ శివరాంరెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లుగా మన నేతలు



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



జానారెడ్డి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రాజగోపాల్‌రెడ్డి

● ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి చోటు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు నేతలు నియమితులయ్యారు. తెలంగాణ ఎన్నికల కోసం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా 40 మందిని స్టార్ క్యాంపెయినర్లుగా ఏఐసీసీ నియమించింది. వారి జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారీక్ అన్వర్ పంపించారు. స్టార్ క్యాంపెయినర్‌గా నియమితులైన వారిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కుందూరు జానారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.

అసత్య ఆరోపణలపై చర్యలు తీసుకోవాలి

భువనగిరి రూరల్ : బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఆరోపణలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల ఏజెంట్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి శనివారం భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోషల్ మీడియాలో పైళ్ల శేఖర్‌రెడ్డిపై కాంగ్రెస్ చార్జిషీట్ పేరుతో తప్పుడు ఆరోపణలతో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించి, ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధానం ఇవ్వాలి



సైకిల్‌యాత్రకు మద్దతు తెలుపుతున్న యువత

సూర్యాపేట : ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని సూర్యాపేటకు చెందిన నిరుద్యోగ యువకుడు గజ్జి శ్రీనివాస్ చంద్ర కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని కుడకుడ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి చిట్యాలలోని మహాత్మా గాంధీ దేవాలయం వరకు సైకిల్ యాత్రతో బయలుదేరి మాట్లాడారు. అగ్రకులాలలో ఉన్న పేద ఆర్యవైశ్యులను గుర్తించి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహంకాళి శివకృష్ణ, బ్రాహ్మణపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు కృషిచేయాలి



మాట్లాడుతున్న యాదాద్రి కలెక్టర్ హనుమంతు కె జెండగే, చిత్రంలో ఎన్నికల పరిశీలకులు

సాక్షి,యాదాద్రి: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే కోరారు. జిల్లా పరిశీలకులతో కలిసి శనివారం ఆయన యాదాద్రి కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు స్వీప్ ప్రచార కార్యక్రమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా పరిశీలకులు కూడా వచ్చారని, సాధారణ పరిశీలకుడిగా సీఎస్ మహేశ్వరన్, పోలీస్ పరిశీలకుడిగా విపులకుమార్, వ్యయ పరిశీలకుడిగా రాకేశ్‌కుమార్ నియమితులయ్యారని వెల్లడించారు. వీరు నేరుగా ఎన్నికల కమిషన్‌తో సంబంధాలు కలిగి వుంటారని పేర్కొన్నారు. జిల్లాలోని ఆలేరు నియోజకవర్గంలో 309, భువనగిరి నియోజకవర్గంలో 257 పోలింగ్ కేంద్రాలు 401 లొకేషన్లల ద్వారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12-ఈ ఫామ్ ద్వారా సీనియర్ సిటిజన్లు 366, దివ్యాంగులు 284 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారంతా ఇంటి వద్దనుంచి ఓటు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్ రోజు విధుల్లో పాల్గొంటున్న 3,912 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12-ఈ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, వాటిని నియోజవర్గాల వారీగా పంపనున్నట్లు వివరించారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోని ఫెసిలిటేషన్ కేంద్రాల్లో వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేస్తారని తెలిపారు. ఎవరైనా ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వంద నిమిషాల్లో పరిష్కరిస్తామన్నారు. 1950 నంబర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నెల 17వ తేదీన అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని వివరిస్తామన్నారు.

టపాకాయల దుకాణాదారుల మధ్య ఘర్షణ

- వ్యక్తిపై గొడ్డలితో దాడి
- తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మిర్యాలగూడ అర్బన్: టపాకాయల షాపు నిర్వాహకుల మధ్య జరిగిన ఘర్షణలో భాగంగా ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన జగడం అశోక్ టపాకాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడికి సమీపంలో టపాకాయల వ్యాపారం నిర్వహించే జాస్తి గోపి తన దుకాణం లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో తనిఖీలకు వచ్చిన అధికారులు అతడి దుకాణాన్ని సీజ్ చేశారు. జగడం అశోక్ తనపై ఫిర్యాదు చేయడంతోనే అధికారులు తన షాపు సీజ్ చేశారని ఆవేశంతో గోపితో పాటు అతడి కుటుంబ సభ్యులు అశోక్‌పై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. అశోక్ దుకాణాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. వారి నుంచి తప్పించుకున్న అశోక్ అక్కడి నుంచి తప్పించుకుని నేరుగా మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ పేర్కొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య

● తాగి వచ్చి వేధింపులకు గురిచేస్తుండడంతో ఘాతుకం

కోదాడ రూరల్: భర్త తాగి వచ్చి వేధింపులకు గురి చేస్తుండడంతో భార్య తట్టుకోలేక అతడిని హతమార్చింది. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కొమరబండకు చెందిన కామళ్ల పుల్లయ్య(45) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. శనివారం సోదరులు, బంధువులు మృతుడి అంత్యక్రియలు చేసేందుకు స్నానం చేయిస్తుండగా అతడి మెడపై గాయాలు కనిపించాయి. అనుమానం వచ్చిన సోదరులు అతడి భార్య ఆదిలక్ష్మిని నిలదీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఆదిలక్ష్మిని అదుపులోకి తీసుకొని విచారించగా తాగొచ్చి వేధింపులకు గురిచేస్తుండగా.. మెడకు వైర్ బిగించి హత్య చేసినట్లు ఒప్పుకుందని పోలీసులు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉన్నారా ఈ హత్యలో పాలుపంచుకున్నారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. వీరికి వివాహమైన కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.



దేవాదాయ - ధర్మాదాయ శాఖ

శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము

గ్రా॥ దర్వేశిపురం (పర్వతగిరి), మం॥ కనగల్, జిల్లా॥ నల్లగొండ

టెండర్ కం - బహిరంగ వేలము ప్రకటన తేది. 10.11.2023

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఇట్టి వేలం పాటలు శ్రీ ఎల్లమ్మ అమ్మవారి దేవస్థానం దర్వేశిపురం వద్ద తేది. 18.11.2023 శుక్రవారం రోజున మ॥గం॥ 1-00 ల నుండి ఈ క్రింద పేర్కొనబడిన వేలములు 2023-2024 సం॥నకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండరు కం-బహిరంగ వేలములు జరుపబడును. ఆసక్తిగలవారు పాటలో పాల్గొనవలసిందిగా కోరనైనది. ఇట్టి వేలమునకు సంబంధించిన షరతులు కార్యాలయములో తెలుసుకొనగలరు.

క్ర. సం.	వేలము వివరములు	కాల పరిమితి 1 సం॥	డిపాజిట్ డబ్బు	టెండర్ షెడ్యూలు ధర	రిమార్క్స్
1	కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు	తేది.01.12.2023 నుండి తేది.30-11-2024 వరకు	10,00,000-00	2000-00	[illegible]
2	పూలు, పండ్లు అమ్ముకొను హక్కు	తేది.01.01.2024 నుండి తేది.31-12-2024 వరకు	2,00,000-00	1000-00	
3	గాజులు అమ్ముకొను హక్కు	తేది.01.12.2023 నుండి తేది.30-11-2024 వరకు	50,000-00	1000-00	
4	చీరలు, వడిబియ్యం సేకరించుకొను హక్కు	తేది.01.12.2023 నుండి తేది.30-11-2024 వరకు	50,000-00	1000-00	
5	కిరాణం & మానియర్ షాపు	తేది.01.12.2023 నుండి తేది.30-11-2024 వరకు	50,000-00	1000-00	

నోట్ : డిపాజిట్ నగదు / డి.డి.లు స్వీకరించబడును. డి.డి.లు కార్యనిర్వహణాధికారి శ్రీ యల్లమ్మ దేవస్థానము, గ్రా॥ దర్వేశిపురం పేరుమీద తీయవలెను.

అల్గుబెల్లి నర్సింహ్మారెడ్డి
చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి
సెల్ : 9963729532

జల్లేపల్లి జయరామయ్య
కార్యనిర్వహణాధికారి
సెల్: 9951999438, 9182701028

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 90000 10884, 80080 88307